క్లుప్తంగా

అప్రమత్తత అవసరం

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ పద్మజ



ఫార్మసీ స్టోర్‌ను పరిశీలిస్తున్న సూపరింటిండెంట్ పద్మజ

విజయనగరం ఫోర్ట్: మందులను భద్రపరచడంలో అప్రమత్తత అవసరమని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ అల్లు పద్మజ అన్నారు. మంగళవారం స్థానిక సర్వజన ఆస్పత్రిలోని ఓపీ, ఫార్మసీ విభాగాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాక్సిన్లు భద్రపరచడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఫార్మాసిస్ట్ బి. నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రామస్వామి ఆలయంలో వేకువ జామున ప్రాతఃకాలార్చన, బాలభోగం చేపట్టారు. అనంతరం సీతారాముల నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాల అనంతరం వైదిక సిబ్బంది బ్రహ్మోత్సవాలకు ఘనంగా అంకురార్పణ చేశారు. బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

పరామర్శ



గణపతి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం గంటస్తంభం: ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న 30వ డివిజన్ కార్పొరేటర్ పతివాడ గణపతిని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మహిళా కార్పొరేటర్లు తాళ్లపూడి సంతోష్ కుమారి, దుప్పాడ సునీత ఉన్నారు.

క్రమశిక్షణతో మెరుగైన జీవితం

- రాష్ట్ర రిసోర్స్ డవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ చక్రపాణి



మాట్లాడుతున్న రాష్ట్ర రిసోర్స్ డవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ చక్రపాణి

డెంకాడ: క్రమశిక్షణ జీవితాన్ని తీరిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని రాష్ట్ర రిసోర్సు డవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి అన్నారు. జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతుల్లో ఆయన మాట్లాడుతూ..ఇంజినీర్లకు లోకజ్ఞానం తప్పనిసరన్నారు.పార్వతీపురం జట్టు ఆశ్రమానికి చెందిన సామాజిక కార్యకర్త పద్మజ మాట్లాడుతూ.. మొదటి సంవత్సరం విద్యార్థులు ఇంజినీరింగ్ పయనాన్ని గొప్ప కట్టుబాటుతో ప్రారంభించాలన్నారు. సృజనాత్మక, విమర్శనాత్మక జ్ఞానం సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, చైర్మన్ పి.మధుసూదనరావు, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలో వచ్చే నెల ఐదు, ఆరో తేదీల్లో నిర్వహించనున్న విజయనగరం ఉత్సవాలను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ. యు. మాణిక్యం నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న మండల, 27న డివిజన్, 30న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులను జూనియర్ విభాగంలో.. 9, 10వ తరగతి విద్యార్థులను సీనియర్ విభాగంలో తలపడాల్సి ఉంటుందన్నారు. విజయనగరం జిల్లా చరిత్ర, సాంస్కృతిక వైభవం అంశంపై వ్యాసరచన పోటీలు... గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి కృషిపై వక్తృత్వం పోటీలు ఉంటాయన్నారు.

ఘటాలతో నివేదన..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మంగళవారం రాత్రి ఘటాలతో మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడికి.. అదేవిధంగా రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడికి భక్తులు అధిక సంఖ్యలో ఘటాలతో చేరుకని అమ్మవారికి సమర్పించారు.

–విజయనగరం టౌన్/సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

15 శాతం వృద్ధి రేటు సాధించాలి

- కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ అనుబంధ రంగాలలో 15 శాతం వృద్ధి రేటు సాధించే విధంగా ఆయా రంగాలు కృషి చేయాలని కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయ , అనుబంధ రంగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరి పంటలో గతేడాది వృద్ధిరేటు 95 శాతం లక్ష్యం కాగా , ఈఏడాది 97 శాతానికి చేరుకుందని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి భారతి, జిల్లా ఉద్యానవన అధికారి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో ముందుండాలి

విజయనగరం అర్బన్: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో స్వర్ణాంధ్ర కార్యక్రమం అమలుతీరుపై ఎంపీడీఓలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలక సంస్థల్లో నిర్ణీత లక్ష్యాలు సాధిస్తున్నారని.. అదేవిధంగా గ్రామాల్లో కూడా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామస్థాయిలో తడి, పొడి చెత్త సేకరణ వివరాలు ప్రతి రోజు పీఆర్ 1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఆటోడ్రైవర్ సేవలో పథకం కోసం అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో సీపీఓ బాలాజీ, సీఈఓ సత్యనారాయణ, డీపీఓ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కవిత, మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, రామలక్ష్మి, అప్పలనాయుడు, హౌసింగ్ పీడీ మురళి, వర్చువల్‌గా ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కోలగట్లను కలిసిన మున్వర్, తదితరులు

విజయనగరం గంటస్తంభం: వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఎం.డి.మున్వర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని మంగళవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. ముస్లింలను గుర్తించి పదవులు కట్టబెడుతున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో నగర కోఆప్షన్ సభ్యుడు రహీం, పార్టీ సీనియర్ లీడర్ బాయిస్, మైనారిటీ సభ్యులు సర్దార్, సల్మాన్, తదితరులున్నారు.

పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ



కుమిలి గ్రామంలో అధికారుల పర్యవేక్షణలో స్లిప్పుల పంపిణీ

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం యూరియా పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులందరూ రైతుసేవా కేంద్రానికి ఒకేసారి రావడంతో గందరగోళం నెలకొంది. దీంతో తహసీల్దార్ ఎస్వీ రమణ, మండల వ్యవసాయాధికారి కొల్లి నీలిమ కలుగజేసుకుని వన్‌బీల వారీగా సిప్పులు అందజేశారు. అనంతరం పోలీసుల సమక్షంలో సిప్పులు ఉన్న వారికి మాత్రమే యూరియా పంపిణీ చేశారు. కొవ్వాడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కూడా రైతుకు ఒక యూరియా బస్తా చొప్పున పంపిణీ జరిగింది.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు మేఘన

విజయనగరం అర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పట్టణానికి చెందిన గురజాడ పాఠశాల విద్యార్థిని పి.మేఘన ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపిందని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.సన్యాసినాయుడు అభినందించారు.

అభివృద్ధికి కూటమి గ్రహణం

- నాడు – నేడు పనులకు నిధులు విదల్చని సర్కారు
- అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవనాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పూసపాటిరేగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా మిగిలిన తరగతి గదులు

పూసపాటిరేగ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరవుతున్నా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, పాఠశాలకు కావాల్సిన అదనపు హంగులకు రూ. 36 కోట్ల నిధులు కేటాయించారు. వెంటనే కొంత నిధులు మంజూరు కావడంతో 16 నెలల క్రితమే నాడు – నేడు పథకంలో భాగంగా పాఠశాలల్లో 50 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అనంతర కాలంలో 2024 జూన్‌లో అధికారం చేపట్టిన కూటమి సర్కారు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులలో పురోగతి లేదు. సంక్షేమ పథకాలపై వరుస కోతలు వేసిన సర్కారు కనీసం విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వ పాలనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖకు కూడా నిధులు మంజూరు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో నాడు – నేడు పనులలో భాగంగా డెంకాడ మండలంలో 10 కాంపొనెంట్స్, అదనపు భవనాలకు కలిపి 37 పాఠశాలలకు రూ. 9 కోట్ల 19 లక్షలు మంజూరు చేయాల్సి ఉండగా.. ఇంతవరకు కేవలం మూడు కోట్ల 83 లక్షల రూపాయల పనులు మాత్రమే జరగడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. నెల్లిమర్ల మండలంలో 10 కాంపొనెంట్స్, 49 పాఠశాలలకు అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. వీటికి రూ. 9.10 కోట్ల మంజూరు కావాల్సి ఉండగా ఇంతవరకు రూ. 5.56 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. అలాగే భోగాపురం మండలంలో 10 కాంపొనెంట్స్, 25 పాఠశాలలకు రూ. 6.5 కోట్లు మంజూరవ్వగా నేటి వరకు కేవలం 3 కోట్ల రూపాయల పనులు మాత్రమే పూర్తయ్యాయి. పూసపాటిరేగ మండలంలో 10 కాంపొనెంట్స్‌కు 41 పాఠశాలలకు గాను రూ.11 కోట్లు మంజూరవ్వగా కేవలం రూ. 4.5 కోట్ల నిధులు మంజూరవడంతో పాఠశాల భవనాలు నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. పూసపాటిరేగ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు వెయ్యిమంది విద్యార్థులున్నారు. వీరికి సరిపడా భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇదే మాదిరిగా నెల్లిమర్ల నియోజకవర్గంలో చాలా పాఠశాలల్లో చాలీచాలని వసతితో విద్యార్థులు కాలక్షేపం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిధులు మంజూరు కాలేదు. పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తి భవనాలు పూర్తి చేయాలి.

ఎస్. పుష్ప, విద్యార్థిని తల్లి, పూసపాటిరేగ

ప్రాధాన్యం ఇవ్వాలి

కూటమి సర్కారు విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఏడాదిన్నరగా నిధులు మంజూరు కాక పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. తక్షణమే ప్రభుత్వ పెద్దలు విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు నిర్మాణాలు పూర్తి చేయాలి.

– బి. వెంకటపోతన్న, పూసపాటిరేగ

అభినందనలు



కోలగట్ల శ్రావణికి అభినందనలు తెలియజేస్తున్న అభిమానులు, పార్టీ నాయకులు

విజయనగరం గంటస్తంభం: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కోలగట్ల శ్రావణికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో 46వ డివిజన్‌కు చెందిన నాయకులు దొంతల శ్రీను, కనిమెరక తవుడు, తదితరులు సీనియర్ నాయకుడు మజ్జి ఆదినారాయణ అధ్యక్షతన శ్రావణిని మంగళవారం కలిసి అభినందనలు తెలియజేవారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గణపతి, సత్యనారాయణ, నిరంజన్, నరేష్, రాజు, చక్రవర్తి పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: జరుగుతున్న నేరాలకు అనుగుణంగా సిబ్బంది కూడా పనితీరు మెరుగుపరుచుకోవాలని ఎస్పీ దామోదర్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎన్డీపీఎస్, పోక్సో, అట్రాసిటీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాద కేసులు, లాంగ్ పెండింగ్ కేసులను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది టెక్నాలజీ, ఇతర సాంకేతిక విధానాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్, వైట్‌కాలర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. బెట్టింగ్‌లు, ఆర్గనైజ్డ్ జూదాలు, కోడి పందాలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని.. అటువంటి వ్యక్తులను ముందుగా గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, పలువురు సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

చల్లంగ చూడమ్మా దుర్గమ్మా..



అరటిపండ్ల అలంకరణలో పైడితల్లి



గాయత్రీదేవీగా వనంగుడిలో కొలువుదీరిన దుర్గాదేవి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని చదురుగుడి, వనంగుడిలతో పాటు వాడవాడలా వెలిసిన మంటపాల్లో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో చదురుగుడిలోని పైడితల్లిని అరటిపండ్లతో అలంకరించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, అర్చకులు తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్ శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. వనంగుడిలో కొలువైన దుర్గామాత మంగళవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే రింగురోడ్డు ఎస్వీఎన్ నగర్‌లో ఉన్న జ్ఞాన సరస్వతీ అమ్మవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడిశ శివకుమార్, చెరుకూరి శ్రీధర్‌ల పర్యవేక్షణలో వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అశ్వవాహనంపై జ్ఞానసరస్వతీ అమ్మవారు

– విజయనగరం టౌన్/ సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

- కార్మిక సంఘ నాయకులు



జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐసీసీటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: పని గంటల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐసీసీటీయూ (ఆలిండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.రమాదేవి, ఏఎల్ఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐసీసీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మద్ది అప్పలరాజు, అసంఘటిత కార్మిక హక్కుల సాధన సమితి కన్వీనర్ బి.గిరిప్రసాద్ మాట్లాడుతూ.. చట్ట ప్రకారం వారానికి 48 గంటలకు మించి పని చేయకూడదన్నారు. మహిళలకు పగటిపూటే రక్షణ లేని పరిస్థితిలో రాత్రి పూట పని చేయించాలనుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో రేషిడ్, గురుమూర్తి, రత్నం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన ..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పదో వార్షికోత్సవం సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ..సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అలాగే చట్టబద్దమైన సెలవులు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్‌డీవీ ప్రసాదరావు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, కామేష్, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.